# విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి
9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 74 బుధవారం జూలై 15 2026, పేజీలు - 4 వెల :2/-


# వేగంగా భూసేకరణ పూర్తి చేయడం పై

# తెలంగాణ ప్రభుత్వాన్ని అభినందించిన కేంద్రం





**-అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు: రేవంత్ రెడ్డి**

**-వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని వినతి**

**-2028 జూన్ 2 నాటికి వరంగల్ విమానాశ్రయం సిద్ధం చేయాలని కోరిన ముఖ్యమంత్రి**

**-కాకతీయ సంస్కృతి ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్ట్ డిజైన్ ఉండాలని సూచన**

హిందుస్థాన్ మీడియా:

అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టకూడదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయానికే పరిమితం కావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఏర్పాటుచేయనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కోరారు. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు వరంగల్ కేంద్రంగా ఉంటుందని, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌తో పాటు ఇతర పరిశ్రమల రాకతో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నందున విమానాశ్రయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి... కేంద్రమంత్రికి వివరించారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి, 2028 జూన్ 2 నాటికి పనులన్నీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని కూడా నిర్మించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణా సంస్థలను (FTO) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని కోరగా, దీనిపై తగిన ప్రతిపాదనలు అందజేయాలని కేంద్రమంత్రి సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రం చేయనంత వేగంగా తెలంగాణ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు.

## వరంగల్ కీలకం

ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండకు వరంగల్ కేంద్ర బిందువుగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలిపారు. రైలు, రోడ్డు మార్గాలతో మెరుగైన అనుసంధానం ఉండటంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ వంటి పరిశ్రమలతో ఈ నగరం మరింత కీలకంగా మారుతుందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలను కేవలం ఎన్నికలకే పరిమితం చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ అంశాల్లో కేంద్ర ప్రభుత్వం తమకు సహకరిస్తోందని, ఏవైనా సమస్యలు ఉంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏదైనా సమాచార లోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని ఆయన వివరించారు.

# కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ పరిశ్రమ విస్తరణకు రంగం సిద్ధం






**-రాయలసీమలో రూ.3,100 కోట్ల పెట్టుబడి.. 700 మందికి ఉద్యోగాలు.. లోకేశ్ శంకుస్థాపన**

**-రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో రెండో ప్లాంట్ నిర్మాణం**

**- పనులకు శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్**

**-కొత్తగా 700 మందికి ఉద్యోగాలు, ప్రభుత్వానికి ఏటా రూ.325 కోట్ల ఆదాయం**

**-పర్యావరణ హితంగా గ్రీన్ ఇండస్ట్రీ ప్రమాణాలతో ప్లాంట్ నిర్మాణం**

హిందుస్థాన్ మీడియా:

ప్రజా ప్రభుత్వ పాలనలో రాయలసీమ పారిశ్రామిక ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ముఖ్యంగా కడప జిల్లాలో పెట్టుబడుల వెల్లువ కనిపిస్తోంది. ఇప్పటికే సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ వంటి కీలక ప్రాజెక్టులు జిల్లాలో కొలువు దీరుతుండగా, తాజాగా మరో భారీ పరిశ్రమ విస్తరణకు అంకురార్పణ జరగనుంది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం, మైలవరం మండలం చిన్నకొమెర్ల వద్ద ఉన్న దాల్మియా భారత్ సిమెంట్ పరిశ్రమ రెండో ప్లాంట్ విస్తరణ పనులకు రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ శంకుస్థాపన చేయనున్నారు. రూ.3,100 కోట్ల భారీ పెట్టుబడితో ఈ విస్తరణ పనులు చేపట్టనున్నారు.ఒండు నెలల వ్యవధిలోనే మంత్రి లోకేశ్ ఇదే నియోజకవర్గంలో రెండోసారి పారిశ్రామిక కార్యక్రమానికి హాజరు కావడం గమనార్హం. ఈ ఏడాది మే 22న కొండాపురం మండలంలో 'సెయిల్' సౌర విద్యుత్ ప్రాజెక్టు ను ఆయన ప్రారంభించారు. ఇప్పుడు దాల్మియా సిమెంట్ విస్తరణతో ఈ ప్రాంత పారిశ్రామిక ముఖచిత్రం మరింత మారనుంది.

## ఉత్పత్తి సామర్థ్యం, ఉద్యోగాల్లో భారీ పెరుగుదల

దాల్మియా సిమెంట్ సంస్థ రూ.3,100 కోట్ల పెట్టుబడితో చేపట్టనున్న ఈ విస్తరణ ద్వారా ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం మైలవరం ప్లాంటులో ఏటా 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి అవుతోంది. కొత్త ప్లాంట్ విస్తరణ పూర్తయ్యాక క్లింకర్ ఉత్పత్తి సామర్థ్యం 6.1 మిలియన్ టన్నులకు, సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది.ఈ విస్తరణ కేవలం ఉత్పత్తికే పరిమితం కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలను కూడా భారీగా పెంచనుంది. ఇప్పటికే ఉన్న ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 950 మంది ఉపాధి పొందుతుండగా, ఈ విస్తరణతో కొత్తగా మరో 700 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. దీంతో మొత్తం ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 1,650కి చేరుకుంటుంది. ఈ ప్రాజెక్టు వల్ల రవాణా, లాజిస్టిక్స్ వంటి అనుబంధ పరిశ్రమల్లోనూ అదనపు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

## ప్రభుత్వ ఖజానాకు పెరగనున్న ఆదాయం

ఈ భారీ పరిశ్రమ విస్తరణతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం దాల్మియా సంస్థ పన్నులు, మైనింగ్ రాయల్టీల రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏటా రూ.102 కోట్లు చెల్లిస్తోంది. ప్రతిపాదిత విస్తరణ పూర్తయితే ఈ ఆదాయం ఏకంగా రూ.325 కోట్లకు పెరుగుతుందని అంచనా.

## పర్యావరణ హితమే లక్ష్యంగా 'గ్రీన్ ఇండస్ట్రీ'

దాల్మియా సంస్థ రెండో దశ విస్తరణ పనులను కేవలం వాణిజ్యపరంగానే కాకుండా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా అత్యుత్తమ ప్రమాణాలతో 'గ్రీన్ ఇండస్ట్రీ'గా తీర్చిదిద్దనుంది. పరిశ్రమకు అవసరమైన విద్యుత్‌లో 80 శాతాన్ని సౌర, పవన విద్యుత్ వంటి పునరుత్పాదక వనరుల నుంచే సమకూర్చుకోనుంది. మొత్తం ప్రాజెక్ట్ విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండేలా గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయనున్నారు. పరిశ్రమలో వాడిన నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు సుమారు రూ.100 కోట్ల పెట్టుబడితో 130 అధిక సామర్థ్య బ్యాగ్ ఫిల్టర్లను ఏర్పాటు చేయనుండటం విశేషం.

## దేశంలో నాలుగో అతిపెద్ద సిమెంట్ సంస్థ

ఎనిమిది దశాబ్దాలకు పైగా సిమెంట్, చక్కెర, విద్యుత్ రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న దాల్మియా భారత్ గ్రూప్, దేశంలో నాలుగో అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థగా గుర్తింపు పొందింది. రూ.14,800 కోట్ల వార్షిక టర్నోవర్‌తో, దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో 19 సిమెంట్ కర్మాగారాలు, గ్రైండింగ్ యూనిట్లను నిర్వహిస్తోంది. సుమారు 33,000 మందికి పైగా డీలర్ల నెట్‌వర్క్‌తో వినియోగదారులకు సేవలందిస్తోంది. ఈ సంస్థ భారీ విస్తరణ చేపట్టడం రాయలసీమ పారిశ్రామిక ప్రగతికి శుభసూచకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

**-రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థిత ప్రజ్ఞ**




హిందుస్థాన్ మీడియా:

తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థిత ప్రజ్ఞ డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్కపాక ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జనజాగరణ యాత్ర ను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూలై 11న ప్రారంభమైన జనజాగరణ యాత్ర 33 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో కొనసాగుతోందని తెలిపారు. 207 జాయింట్ యాక్షన్ కమిటీ సంఘాలు, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల మద్దతుతో ఈ యాత్ర సాగుతోందన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు హిమాచల్ ప్రదేశ్‌లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించినట్లే తెలంగాణలో కూడా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా పాత పెన్షన్ అమలుపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. సుమారు 2.6 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా శాసనసభ్యులకు వినతిపత్రాలు అందజేస్తున్నామని తెలిపారు.30 ఏళ్ల సేవ అనంతరం కూడా సీపీఎస్ ఉద్యోగులకు రూ.5 వేల నుంచి రూ.6 వేల లోపు మాత్రమే పెన్షన్ వస్తోందని, ఇప్పటికే పదవీ విరమణ పొందిన సుమారు 2,000 మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్ అయిన సీపీఎస్ ఉద్యోగులకు ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్‌ఎస్) కింద ఉచిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు.అలాగే డీఏ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అందలేదన్నారు. ఉద్యోగుల బకాయిల చెల్లింపుల కోసం ప్రభుత్వం విడుదల చేయనున్న నిధుల్లో సీపీఎస్ ఉద్యోగుల బకాయిలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అనంతరం తెలిపారు.ఆగస్టు 23న నిర్వహించే "ఛలో హైదరాబాద్ పోస్టర్ను ఆవిష్కరించి ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులందరూ భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ ఈ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, జిల్లా కోశాధికారి గుయ్యాని ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ యూసుఫ్, సంయుక్త కార్యదర్శి నారాయణదాసు సతీష్ కుమార్, మామిడి సురేందర్, చిట్యాల సతీష్, సురభి శేఖర్, వీరారెడ్డి, షఫీ, మౌనిష్, పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు తంగేళ్ల జితేందర్ రెడ్డి, టి యు టిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మామిడి అరవిందు, ప్రధాన కార్యదర్శి కిషన్ ప్రసాద్, బి సి టి యు రాష్ట్ర అధ్యక్షులు బెల్లంకొండ రామ్మూర్తి, వెంకట్ రెడ్డి, దండుగుల మల్లయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



హిందుస్థాన్ మీడియా

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, పేద, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ భద్రబోయిన సైదులు, జిల్లా ఉపాధ్యక్షుడు బైరోజు మదనాచారి డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, గ్రీన్ చాక్‌బోర్డులు వంటి మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని, అలాంటి విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, నాణ్యమైన భోజనం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో కక్కిరేణి నాగేంద్రబాబు, బూర సందీప్, సాయి, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి

**-విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి**
**-జిల్లా కలెక్టర్ అంకిత్**
**-చంద్రుగొండ మండలంలో విస్తృతంగా ద పర్యటించిన జిల్లా కలెక్టర్**

భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:

భూసేకరణ ఎస్ఐఆర్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అదేవిధంగా విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం చంద్రుగొండ మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించి ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తిప్పనపల్లి గ్రామంలో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణ సర్వే పనులు మద్దుకూరు గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ అనంతరం చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూసేకరణ ఎస్ఐఆర్ ప్రక్రియలను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య పోషకాహారం క్రీడలకు అవసరమైన ప్రోత్సాహం అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ముందుగా తిప్పనపల్లి గ్రామంలో కొనసాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణ సర్వే పనులను పరిశీలించారు. సర్వే పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తిప్పనపల్లి గ్రామ పరిధిలో మొత్తం 70 ఎకరాల భూమికి సర్వే నిర్వహించాల్సి ఉండగా ప్రతిరోజూ సుమారు 15 ఎకరాల మేర సర్వే చేపడుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన సర్వేను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి భూయజమానికి సంబంధించిన వివరాలతో పాటు బోర్లు సాగులో ఉన్న పంటలు ఆయిల్ పామ్ తోటలు ఇతర శాశ్వత ఆస్తుల వివరాలను క్షుణ్ణంగా నమోదు చేయాలని సూచించారు. భూసేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.దుద్దుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ పరిశీలన డిజిటలైజేషన్ రికార్డుల నిర్వహణను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 65 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని అధికారులు వివరించగా మిగిలిన ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా డిజిటలైజేషన్ చేపట్టాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా ఖచ్చితత్వంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. చంద్రుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వడ్డిస్తున్న సాంబార్ పలుచగా ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం



నిర్దేశించిన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని పరిశుభ్రత నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు విద్యా ప్రగతి యూనిఫాంల పంపిణీపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి విద్యతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి విద్యార్థి వాలీబాల్, కబడ్డీ వంటి క్రీడల్లో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం క్రమశిక్షణ జట్టు స్ఫూర్తి నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషకాహారం అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తహసీల్దార్ జగదీశ్వరరావు, ఎంపీడీవో అశోక్, ఇరిగేషన్ శాఖ అధికారులు, సర్వే అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రద్దు కాబడిన రైళ్లను పునరుద్ధరించాలి

**-సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ శ్రీనివాస్ రెడ్డి**
**- రైల్వే సమస్యలపై డిఆర్ఎంకు వినతి పత్రం**

భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:

కరోనా సమయంలో రద్దు కాబడిన పలు రైళ్లను వెంటనే పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు మెంబర్ శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ గోపాలకృష్ణకు రైల్వే సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ిణుగూరు సూపర్ ఫాస్ట్ కు కెన్నెరసాని పేరు పెట్టాలని కరోనా కాలంలో రద్దు అయిన మణుగూరు కాజీపేట ట్రైను, బెలగావి కొలహపూర్ ఎక్స్ప్రెస్ ట్రైన్ తిరిగి వెంటనే నడిపించాలని అదేవిధంగా మణుగూరు చర్లపల్లి మధ్య ఇంటర్సిటీ ట్రైన్ ప్రజల కోరిక మేరకు నడపాలని దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి నుండి తిరుపతి షిరిడికి ఇటు వేములవాడ బాసరకు ప్రత్యేక రైలు సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి ఆధుని కరుణ పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని కోరారు. కొత్తగూడెం నడిబొడ్డున ప్రజలకు ఇబ్బందిగా ఉన్న రాజీవ్ పార్క్ ప్రగతి మైదాన్ కు వెళ్లే మూసివేసిన దారిని తిరిగి ఓపెన్ చేపించాలని కోరారు. సూపర్ ఫాస్ట్ ను ప్లాట్ నెంబర్ వన్ కు మార్చి నడపాలని స్టేషన్లో ఎంక్వయిరీ కౌంటర్ ను తక్షణమే ఏర్పాటు చేయాలని అదేవిధంగా రైల్వే స్టేషన్ నుండి గొల్లగూడెం వెళ్లే రహదారి వెడల్పుకు తక్షణమే భూ బదలాయింపు చేసి రోడ్డు వెడల్పు సహకరించాలని డిఆర్ఎమ్ కు శ్రీనివాసరెడ్డి విపులంగా వివరించారు. డిఆర్ఎం మాట్లాడుతూ మణుగూరు కాజీపేట ట్రైన్ త్వరలోనే నడిపిస్తామని కొత్తగూడెం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయటం కోసం అధికారులకు ఆదేశాలు ఇచ్చామని మణుగూరు టు చర్లపల్లి ఇంటర్సిటీ ట్రైన్ ఏర్పాటుకు ఇండియన్ రైల్వేస్ తో చర్చించి నిర్ణయం చేస్తామని స్టేషన్లో ఎంక్వయిరీ కౌంటర్ ను వెంటనే ఏర్పాటు చేపిస్తామని సూపర్ ఫాస్ట్ కూడా కిన్నెరసాని పేరు పెట్టే ప్రక్రియను కూడా పరిశీలిస్తామని తెలిపారు. తిరుపతి శిరిడి వేములవాడ బాసరకు ప్రత్యేక రైలు ఏర్పాట్లు కూడా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కోడుమూరు



శ్రీనివాసరావు, ఎడిఆర్ఎం ముత్యాల నాయుడు, సీనియర్ డిఎం కోఆర్డినేటర్ యాదగిరి శశాంక్, డీసీఎం శివహర్ష, డివైసిఎం నరేంద్ర వర్మ, ఏవో రాజేంద్రబాబు, ఏఐ పాషా, సిసిఐ జేమ్స్ పాల్, రైల్వే పోలీస్ సిఐ కృష్ణ, ఎస్సై ప్రశాంత్ రెడ్డి, స్టేషన్ మేనేజర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలి

**- గంజాయి హాట్‌స్పాట్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలి**
**- నెలవారి నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

భద్రాద్రి కొత్తగూడెం, హిందుస్థాన్ మీడియా:

ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తుతో నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని గంజాయి హాట్‌స్పాట్స్‌పై ప్రత్యేక నిఘా, ప్రాపర్టీ కేసుల డిటెక్షన్ పెంచాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. మంగళవారం ఆయన పోలీస్ హెడ్క్వార్టర్స్‌లో జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని నేరాల పరిస్థితి పెండింగ్ కేసులు దర్యాప్తు పురోగతి శాంతిభద్రతలు సైబర్ నేరాలు మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, శాస్త్రీయ ఆధారాలతో పటిష్ఠమైన దర్యాప్తు నిర్వహించి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల విచారణలో జాప్యం సహించబోమని హెచ్చరిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య, నాట్‌గ్రిడ్ వంటి సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించి కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా విక్రయం వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు గంజాయి హాట్‌స్పాట్స్‌ను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ర్యాపిడ్ డ్రగ్ టెస్ట్ కిట్లతో పరీక్షలు నిర్వహించి నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే అక్రమ మద్యం జూదం పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర దాడులు నిర్వహించాలని సూచించారు. ప్రాపర్టీ కేసులను ప్రాధాన్యతగా తీసుకుని సీసీటీవీ ఫుటేజీలు సాంకేతిక ఆధారాలతో త్వరితగతిన ఛేదించి దొంగిలించిన సొత్తును బాధితులకు అప్పగించాలని సూచించారు. వాహన తనిఖీలు రాత్రి పెట్రోలింగ్ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ రౌడీ షీటర్లు, హిస్టరీషీటర్లు, బెయిల్‌పై ఉన్న నేరస్థులు, జైలు నుంచి విడుదలైన వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై



ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు మహిళలు చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, డయల్-100కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర సహాయం అందించాలని ఆదేశించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం ర్యాష్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి మంగళ, శుక్రవారాల్లో 'డ్రై డే' పాటించండి

**--వైస్ చైర్మన్ ఉమా శ్రీధర్**

చేర్యాల, జూలై 14 (హిందుస్థాన్ మీడియా):

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రతి మంగళవారం, శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని ప్రజలంతా తప్పనిసరిగా పాటించాలని చేర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమా శ్రీధర్ కోరారు.ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నిల్వ నీటిని తొలగించాలని, నీటి పాత్రలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్లు, పూల కుండీలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే వర్షపు నీటిని వృథా చేయకుండా రైన్‌వాటర్ హార్వెస్టింగ్ ద్వారా భూగర్భ జలాలను పెంపొందించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత, ఆరోగ్యం, నీటి సంరక్షణపై ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరిస్తే ఆరోగ్యకరమైన చేర్యాల



నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు.

# బిజినెస్

# ఈ-20 పెట్రోల్‌పై ఎన్‌డీఏ ఓటర్లకూ గుబులు!: వాహనాలు పాడవుతాయని మెజారిటీ జనం భయం.. 'సీ-ఓటర్' సర్వేలో సంచలన విషయాల వెల్లడి

**-ఇథనాల్ కలిపిన ఈ-20 పెట్రోల్ వాడకానికి 55 శాతం మంది విముఖత**
**-సొంత కూటమి ఎన్‌డీఏ మద్దతుదారుల్లోనూ 52.5 శాతం వ్యతిరేకత**
**-ఈ-20 వల్ల మైలేజ్ తగ్గుతుందని 52.8 శాతం మంది నమ్మకం**
**-వాహన ఇంజిన్లు దెబ్బతింటాయంటూ వాహనదారుల్లో తీవ్ర ఆందోళన**
**-ధర తగ్గించినా ఇథనాల్ ఇంధనం వాడేందుకు జనం సుముఖంగా లేరని వెల్లడి**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానంపై దేశవ్యాప్తంగా వాహనదారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కేంద్రంలోని అధికార ఎన్‌డీఏ కూటమిని సమర్థించే ఓటర్లు సైతం ఈ సరికొత్త ఇంధనాన్ని వాడేందుకు ఇష్టపడటం లేదని ప్రముఖ పరిశోధన సంస్థ 'సీ-ఓటర్' నిర్వహించిన తాజా సర్వేలో వెల్లడైంది. ఇథనాల్ కలిపిన పెట్రోల్ వల్ల వాహనాల మైలేజ్ తగ్గడమే కాకుండా, ఇంజిన్లు దెబ్బతినే ప్రమాదం ఉందన్న ఆందోళన దేశ ప్రజల్లో బలంగా నాటుకుపోయింది.

**నితిన్ గడ్కరీ సవాల్.. ఆందోళనకారుల ప్రతిసవాల్!**

ఈ-20 పెట్రోల్ వల్ల నష్టపోయిన ఒక్కరినైనా చూపించాలంటూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల విమర్శకులకు సవాల్ విసిరారు. అయితే, దీనిపై నిరసనకారులు తక్షణమే స్పందించారు. ఒక్కరిని కాదు.. ఇథనాల్ పెట్రోల్ వాడి తమ వాహనాలు పాడైపోయాయని లబోదిబోమంటున్న ఆరుగురు బాధితులను మంత్రి ముందర నిలబెడతామని ప్రతిసవాల్ చేశారు. అయితే మీడియా ముందుకు వెళ్లేకంటే ముందే, ఈ విషయమై గడ్కరీ తమతో నేరుగా సమావేశం కావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ ఇంధనం సురక్షితమేనని చెబుతున్నప్పటికీ, ముఖ్యంగా పాత వాహనాల యజమానులు ఈ విధానం వల్ల తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు.

**ఎన్‌డీఏ ఓటర్లలోనూ అదే భయం**

సీ-ఓటర్ దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. దాదాపు 52.5 శాతం మంది ఎన్‌డీఏ మద్దతుదారులు తమ వాహనాల్లో ఈ-20 పెట్రోల్ వాడటానికి నిరాకరించగా, కేవలం 18.1 శాతం మంది మాత్రమే మొగ్గు చూపారు. ఇక ప్రతిపక్షాల మద్దతుదారుల్లో ఈ వ్యతిరేకత 57.9 శాతంగా ఉంది. మొత్తం మీద చూసుకుంటే దేశంలో 55.1 శాతం మంది వాహనదారులు ఈ ఇంధనానికి నో చెబుతున్నారు. ఇథనాల్ కలపడం వల్ల మైలేజ్ తగ్గుతుందని 52.8 శాతం మంది, అసలు వాహనాలే పాడైపోతాయని 54.2 శాతం మంది బలంగా నమ్ముతున్నారు.

**ధర తగ్గించినా వద్దే వద్దు!**




సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్ కలిపిన పెట్రోల్ ధర తక్కువగా ఉండాలని 74.5 శాతం మంది అభిప్రాయపడ్డారు. అయితే, ఒకవేళ ప్రభుత్వం ధర తగ్గించి అమ్మినా కూడా.. తాము ఈ-20 పెట్రోల్‌కు మారబోమని 40.4 శాతం మంది కుండబద్దలు కొట్టారు. అలాగే పెట్రోల్ బంకుల్లో ఇథనాల్ కలిపిన పెట్రోల్‌తో పాటు, పాత పద్ధతిలోని సాధారణ పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచాలని, దేన్ని వాడాలో ఎంచుకునే స్వేచ్ఛ కస్టమర్లకే వదిలేయాలని 75.9 శాతం మంది డిమాండ్ చేస్తున్నారు. ముడిచమురు దిగుమతులు తగ్గించుకోవడానికి కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాహనదారుల నమ్మకాన్ని గెలవడంలో ప్రభుత్వం వెనుకబడిందని ఈ సర్వే స్పష్టం చేస్తోంది.

# క్రీడలు

# ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే: సీనియర్లతో బరిలోకి భారత్.. టాస్ నెగ్గిన ఇంగ్లండ్



-భారత్‌తో తొలి వన్డేలో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్
-పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉందన్న కెప్టెన్ హ్యారీ బ్రూక్
-సీనియర్ల రాకతో జట్టుకు అదనపు బలం చేకూరిందన్న భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్
-ఇంగ్లండ్ తరఫున వన్డే అరంగేట్రం చేసిన ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్
-200వ వన్డే ఆడుతున్న ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జోస్ బట్లర్

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌కు తెరలేచింది. ఎడ్జ్‌బాస్టన్ స్టేడియం వేదికగా జరుగుతున్న తొలి వన్డేలో ఇంగ్లండ్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకుంది. టాస్ గెలిచిన అనంతరం ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ మాట్లాడుతూ.. పిచ్ పరిస్థితులను అంచనా వేసి బ్యాటింగ్ ఎంచుకున్నట్లు తెలిపాడు. "పిచ్ ఆరంభంలో బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంది. మ్యాచ్ సాగేకొద్దీ స్పిన్నర్లకు సహకరించే అవకాశం ఉంది. అందుకే ముందుగా బ్యాటింగ్ చేసి భారీ స్కోరు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించాడు. టీ20 సిరీస్‌లో అనుసరించిన దూకుడైన వ్యూహంతోనే ఈ సిరీస్‌ను కూడా ఆడతామని స్పష్టం చేశాడు. గత కొంతకాలంగా వన్డే ఫార్మాట్‌లో తమ ప్రదర్శన నిలకడగా లేనప్పటికీ, ఈ సిరీస్‌తో దానిని అధిగమించి స్థిరమైన విజయాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఇద్దరు స్పిన్నర్లు, ముగ్గురు సీమర్లతో సమతూకమైన బౌలింగ్ విభాగంతో బరిలోకి దిగుతున్నట్లు బ్రూక్ పేర్కొన్నాడు. ఈ మ్యాచ్ ఇంగ్లండ్ జట్టుకు పలు మైలురాళ్లను అందించింది. వికెట్ కీపర్-బ్యాటర్ జోస్ బట్లర్ తన 200వ వన్డే ఆడుతున్నాడు. ఇయాన్ మోర్గాన్ (225 వన్డేలు) తర్వాత ఇంగ్లండ్ తరఫున ఈ ఘనత సాధించిన రెండో ఆటగాడిగా అతను నిలిచాడు. అదేవిధంగా, యువ ఫాస్ట్ బౌలర్ జోష్ టంగ్ ఈ మ్యాచ్ ద్వారా వన్డే ఫార్మాట్‌లో అరంగేట్రం చేయగా, స్పిన్నర్ లియామ్ డాసన్ తన 50వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్నాడు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. తాము టాస్ గెలిచి ఉంటే ఫీల్డింగ్ ఎంచుకునేవాళ్లమని చెప్పాడు. "ఇక్కడి వాతావరణం, పిచ్ పరిస్థితులు భారత్‌లో కంటే దక్షిణాఫ్రికాలో ఉన్నట్లుగా అనిపిస్తున్నాయి. అందుకే మేం ముందుగా బౌలింగ్ చేయాలనుకున్నాం" అని అన్నాడు. ఈ సిరీస్ ద్వారా తక్కువ వన్డే అనుభవం ఉన్న ఆటగాళ్లకు అవకాశాలు కల్పించాలనేది తమ ఉద్దేశమని తెలిపాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, జస్ప్రీత్ బుమ్రా వంటి సీనియర్ ఆటగాళ్లు జట్టులోకి తిరిగి రావడం ఎంతో సానుకూలాంశమని, వారి అనుభవం జట్టుకు ఎంతగానో ఉపయోగపడుతుందని గిల్ ధీమా వ్యక్తం చేశాడు. ఇంగ్లండ్‌లో తనకు మంచి రికార్డు ఉందని, టెస్టు సిరీస్‌లో కనబరిచిన ఫామ్‌ను వన్డేల్లోనూ కొనసాగిస్తానని ఆశాభావం వ్యక్తం చేశాడు. నలుగురు సీమర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగుతున్నట్లు గిల్ వెల్లడించాడు.

**జట్ల వివరాలు:**
**భారత్:** శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), వాషింగ్టన్ సుందర్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, గుర్నూర్ బ్రార్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ.
**ఇంగ్లండ్:** జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), శామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, జోష్ టంగ్, అదిల్ రషీద్.

## ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ తర్వాత టీమిండియా కోచ్‌ల్లో ఒకరు రాజీనామా?

**-టెన్ డూస్కాటే రాజీనామాకు సిద్ధమైనట్లు కథనం**
**-బీసీసీఐకి నిర్ణయం తెలిపినట్లు సమాచారం**
**-ఇంగ్లండ్ సిరీస్ తర్వాత తప్పుకొనే అవకాశం**
**-వ్యక్తిగత కారణాలతోనే నిర్ణయమని సమాచారం**
**-కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలని భావన**

భారత క్రికెట్ జట్టు సహాయ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్ ముగిసిన తర్వాత బాధ్యతల నుంచి తప్పుకోవాలనే తన నిర్ణయాన్ని ఇప్పటికే బీసీసీఐకి తెలియజేసినట్లు క్రిక్‌బజ్ కథనం వెల్లడించింది. బీసీసీఐతో పాటు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ అంగీకరిస్తే, ఇంగ్లండ్‌తో చివరి వన్డే అతడికి భారత జట్టుతో ఆఖరు మ్యాచ్ కానుంది. టెన్ డస్కాటే నిర్ణయానికి అసంతృప్తి కారణం కాదని క్రిక్‌బజ్ కథనం పేర్కొంది. వ్యక్తిగత కారణాలతో పాటు కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. లండన్‌లో నివసిస్తున్న తన కుటుంబంతో ఎక్కువ సమయం గడపడంతో పాటు తక్కువ ప్రయాణాలు ఉండే బాధ్యతలను స్వీకరించాలని అతడు భావిస్తున్నట్లు వెల్లడించింది. రెండేళ్ల క్రితం భారత జట్టు సహాయ కోచ్‌గా టెన్ డస్కాటే బాధ్యతలు చేపట్టాడు. అతడి తొలి ఒప్పందం కూడా ఇటీవలే ముగిసినట్లు సమాచారం. గౌతమ్ గంభీర్ సిఫార్సుతోనే అతడు కోచింగ్ బృందంలో చేరగా, రాజీనామాను ఆమోదించాలా వద్దా అనే విషయంలో గంభీర్‌కు కూడా అభిప్రాయం చెప్పే అవకాశం ఉందని కథనం పేర్కొంది. అయితే అతడి రాజీనామాను అడ్డుకునే అవకాశం చాలా తక్కువగా ఉందని తెలిపింది. మరోవైపు, భారత మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ మాట్లాడుతూ.. ఇంగ్లండ్, ఐర్లాండ్‌తో టీ20 సిరీస్‌ల్లో గంభీర్‌కు పూర్తి స్థాయి జట్టు అందుబాటులో లేదన్నాడు. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా లేకపోవడం ప్రభావం చూపిందని చెప్పాడు. రెండు సిరీస్‌ల్లో ఓడిపోయినంత మాత్రాన గంభీర్‌ను విమర్శించడం తొందరపాటు అవుతుందని వ్యాఖ్యానించాడు.



# ‘పరిమళ అండ్ కో’ (జీ 5) మూవీ రివ్యూ!




కోలీవుడ్ లో దర్శకుడిగా పాండిరాజ్ కి మంచిపేరు ఉంది. వైవిధ్యభరితమైన కథలను తెరపై వినోదభరితంగా .. ఆసక్తికరంగా ఆవిష్కరించడం ఆయన ప్రత్యేకత. కామెడీ టచ్ ఇస్తూనే ఎమోషన్స్ ను కనెక్ట్ చేయడంలో సిద్ధహస్తుడు. ఆయన రూపొందించిన సినిమానే ‘పరిమళ అండ్ కో’. జయరామ్ ప్రధానమైన పాత్రగా తెరకెక్కిన ఈ సినిమా, జూన్ 5వ తేదీన థియేటర్లకు వచ్చింది. బ్లాక్ కామెడీ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఈ సినిమా, ఈ నెల 10వ తేదీ నుంచి ‘జీ 5’ లో ఐదు భాషల్లో అందుబాటులోకి వచ్చింది.దనగరంలో పరిమళ ( జయరామ్) తన కుటుంబంతో కలిసి నివసిస్తూ ఉంటాడు. అప్పారావు (యోగిబాబు) ఇంట్లో చాలా కాలం నుంచి అద్దెకి ఉంటాడు. ఆయన భార్య స్వరాజ్యం (ఊర్వశి) కూతుళు పరాశక్తి (సంజనా కృష్ణమూర్తి) మధుమిత (అనంతిక). పరిమళ మిడిల్ క్లాస్ ఫ్యామిలీని చాలా పొదుపుగా నెట్టుకొస్తుంటాడు. అయితే ఆ సిటీలో వర్గీస్ (శాండీ) అనే జులాయి తిరుగుతూ ఉంటాడు. అతను నగరంలోని కాలేజ్ కుర్రాళ్లకు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తుంటాడు. అతని వెనక రాజకీయనాయకులు ఉండటంతో పోలీసులు వెనకడుగు వేస్తుంటారు. ‘జాలరిపేట’కి చెందిన వర్గీస్, హత్యలు చేయడానికి కూడా ఎంతమాత్రం వెనుకాడడు. అందువలన అతనంటే అక్కడి వాళ్లంతా భయపడుతుంటారు. ప్రేమిస్తున్నానంటూ అతను మధుమిత వెంటపడుతూ ఉంటాడు. పరిమళతో పాటు అతని పెద్ద కూతురు .. చిన్నకూతురు ఎంతగా మందలించినా అతను వినిపించుకోడు. వర్గీస్ తల్లి సురేఖావాణి కూడా ఆ ఏరియాలో తన దందా కొనసాగిస్తూ ఉంటుంది. మధుమిత విషయంలో ఆమె కొడుకును మరింత సపోర్ట్ చేస్తుంది. దాంతో వర్గీస్ చనిపోతేనే తాము ప్రశాంతంగా బ్రతకగలమని పరిమళ భావిస్తాడు. మిగతా కుటుంబ సభ్యులంతా అతని నిర్ణయానికి తమ మద్దతును తెలియజేస్తారు. చిట్టీ ( సంతోష్ శోభన్)అనే యుకుడిని పరాశక్తి ప్రేమిస్తూ ఉంటుంది. వర్గీస్ విషయంలో తమ ఫ్యామిలీ తీసుకున్న నిర్ణయాన్ని గురించి ఆమె చిట్టీతో చెబుతుంది. ఆ మరుసటి రోజునే వర్గీస్ దారుణంగా హత్య చేయబడతాడు. ఈ వార్త బయటికి రాగానే, సిటీ అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడుతుంది. వర్గీస్ చనిపోవడానికి ముందు అతనికి పరిమళ ఫ్యామిలీతో గొడవ జరిగిందని తెలుసుకున్న సురేఖావాణి, తన అనుచరులతో బయల్దేరుతుంది. వర్గీస్ తో పరిమళకు గల గొడవను గురించి తెలుసుకున్న పోలీస్ టీమ్ కూడా పరిమళ ఇంటికి బయల్దేరుతుంది. తన ఫ్యామిలీ ప్రమాదంలో పడుతుందని గ్రహించిన పరిమళ ఏం చేస్తాడు? అతను తీసుకున్న నిర్ణయం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుంది? వర్గీస్ ను హత్య చేసింది ఎవరు? అనేది మిగతా కథ. ఒక మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఒక రౌడీ హత్య కేసులో చిక్కుకుంటుంది. ఆ ఫ్యామిలీ కోసం ఒక వైపున పోలీస్ ఆఫీసర్ ఏడుకొండలు గాలిస్తుంటే, మరో వైపున ఆ రౌడీ తాలూకు గ్యాంగ్ వెంటాడుతూ ఉంటుంది. వాళ్ల బారి నుంచి ఆ ఫ్యామిలీ తప్పించుకో గలుగుతుందా? ప్రాణాలతో బయటపడగలుగుతుందా? వర్గీస్ హత్య వెనకున్న సూత్రధారులు ఎవరు? అనే ఒక ఆసక్తికరమైన అంశం చుట్టూ ఈ కథ తిరుగుతూ ఉంటుంది. మధ్యతరగతి కుటుంబీకులు పరువుకు ప్రాణం ఇస్తుంటారు. డబ్బు .. అధికారం .. రాజకీయనాయకుల అండదండలు ఉన్నవారు, మిడిల్ క్లాస్ అమ్మాయిలను టార్గెట్ చేస్తుంటారు. అలాంటివారైతే పరువుకు భయపడి బయటికి రారనీ, తమని ఏమీ చేయలేరనే ఒక ధైర్యంతో ఉంటారు. అయితే అలాంటి మిడిల్ క్లాస్ ఫ్యామిలీని కాపాడుకోవడానికి తండ్రి అనేవాడు ఎంతకైనా తెగిస్తాడనే విషయాన్ని చాటి చెప్పిన సినిమానే ‘దృశ్యం’. అలాంటి ఒక సినిమాను పోలినదిగా ‘పరిమళ అండ్ కో’ కనిపిస్తుంది. అయితే కంటెంట్ పరంగా ఇది ‘దృశ్యం’ సినిమాకి పూర్తి భిన్నంగా ఉంటుంది. ‘దృశ్యం’ సినిమా సీరియస్ గా కొనసాగితే, ఈ సినిమా మాత్రం కామెడీ టచ్ ఇస్తూ ఫ్యామిలీ ఎమోషన్స్ ను కనెక్ట్ చేస్తుంది. హంతకుడు ఎవరనేది చివరివరకూ ఆడియన్స్ కనుక్కోలేని విధంగా దర్శకుడు ఈ కథను నడిపించిన తీరు ఆకట్టుకుంటుంది. ఒక రౌడీ హత్య .. ఆ విషయంలో అనుమానితులుగా నిలిచిన ఒక ఫ్యామిలీ, ఆవేశంతో వాళ్లను వెంటాడే హతుడి తాలూకు అనుచరులు .. అసలేం జరిగిందనేది తెలుసుకోవడానికి రంగంలోకి దిగిన పోలీస్ టీమ్. ఇలా ఈ మూడు వైపుల నుంచి కథను .. పాత్రలను నడిపించిన తీరు చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ చాలా సహజంగా తమ పాత్రలను పండించారు .. సన్నివేశాలను రక్తికట్టించారు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఈ కంటెంట్ ను నెక్స్ట్ లెవెల్ కి తీసుకుని వెళ్లాయి. ఈ సినిమాలో బరువైన పాత్రలు గానీ, బలమైన సన్నివేశాలు గానీ లేవు. సరదాగా నవ్విస్తూనే, నెక్స్ట్ ఏం జరగనుందా? అనే ఒక కుతూహలాన్ని రేకెత్తిస్తుంది. చివర్లో వచ్చే ట్విస్టులు ఈ కథకి మరింత బలాన్ని చేకూర్చుతాయి. ఫ్యామిలీతో కలిసి చూడదగిన సినిమానే ఇది.




## ‘లెనిన్’ బ్లాక్‌బస్టర్.. కానీ నా కాళ్లు నేల మీదే ఉన్నాయి: అఖిల్

‘-లెనిన్’ భారీ విజయంపై స్పందించిన హీరో అఖిల్ అక్కినేని
-తాను గాల్లో తేలిపోవడం లేదన్న యంగ్ హీరో
-నాన్న నాగార్జున మాటలతో కాకుండా ఓ ప్రత్యేకమైన హగ్‌తో అభినందించారని వెల్లడి
-మూడు రోజులకే డిస్ట్రిబ్యూటర్లు లాభాల్లోకి రావడం సంతోషాన్నిచ్చిందని వ్యాఖ్యలు
-సినిమా వంద కోట్ల మార్కును చేరుకుంటుందన్న ధీమా వ్యక్తం చేసిన అఖిల్

అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘లెనిన్’ బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. విడుదలైన తొలి మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 61 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి, బ్లాక్‌బస్టర్ దిశగా దూసుకెళ్తోంది. అయితే, ఈ భారీ విజయంపై అఖిల్ అక్కినేని ఎంతో పరిణతితో స్పందించారు. తనకు దక్కిన ఆదరణ పట్ల కృతజ్ఞతగా ఉన్నప్పటికీ, అప్పుడే గాల్లో తేలిపోవడం లేదని, తన కాళ్లు ఇంకా నేల మీదే ఉన్నాయని స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అఖిల్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ‘లెనిన్’ చిత్రం మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ సాధించి, డిస్ట్రిబ్యూటర్లను లాభాల బాట పట్టించడం తనకు మాటల్లో చెప్పలేని సంతృప్తిని ఇచ్చిందన్నారు. “ఈ ఉదయం నా డిస్ట్రిబ్యూటర్ల నుంచి వచ్చిన మెసేజ్‌లు నాకు అత్యంత ఆనందాన్నిచ్చాయి. ‘సార్, మా పెట్టుబడి వచ్చేసింది. ఈ రోజు నుంచి లాభాల్లోకి వెళుతున్నాం’ అని వారు చెప్పారు. ఇది నాకు మాటల్లో చెప్పలేనంత శక్తిని, సంతృప్తిని ఇస్తోంది. వీకెండ్ ముగిసేలోపే నా వాళ్లంతా లాభాల్లో ఉన్నారు. నేను నా కుటుంబంతో సంతోషంగా ఉన్నాను, వారు వారి కుటుంబాలతో ఆనందంగా ఉన్నారు. ఇంతకంటే ఏం కావాలి!” అని అఖిల్ వివరించారు. సినిమా విజయంపై తండ్రి నాగార్జున స్పందన గురించి అడగ్గా, “ఈ విజయంపై నాన్న ప్రత్యేకంగా మాటలేమీ చెప్పలేదు. ఎంతో ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆ ఒక్క హగ్‌లోనే ఆయన చెప్పాలనుకున్నదంతా నాకు అర్థమైంది. ఆ ఒక్క అనుభూతి చాలు, పడిన కష్టమంతా మర్చిపోవడానికి!” అని అఖిల్ అన్నారు. తాము ప్రేక్షకుల కోసమే పనిచేస్తామని, వారి అభిమానాన్ని పొందినప్పుడు కలిగే అనుభూతి వెలకట్టలేనిదని అఖిల్ పేర్కొన్నారు. “మేము పనిచేసేది ప్రేక్షకుల కోసమే. వారు మా కంటెంట్‌ను ఆస్వాదించినప్పుడు, అంతకంటే నాకేం కావాలి? ఇది నాకు చాలా అనుకూలమైన పరిస్థితి. కానీ, అప్పుడే గాల్లో తేలిపోవడం లేదు. నేను ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది” అని వినమ్రంగా తెలిపారు. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ‘లెనిన్’ చిత్రంలో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ జులై 10న ప్రేక్షకుల ముందుకు వచ్చి, అఖిల్ కెరీర్‌లో ఒక ముఖ్యమైన విజయంగా నిలిచింది.

## వంద మందిలో ఉన్నా ఒంటరినే.. అవిక గోర్ భావోద్వేగ పోస్ట్



‘బాలికా వధు’ (తెలుగులో చిన్నారి పెళ్లి కూతురు) సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుని, పలు విజయవంతమైన తెలుగు చిత్రాల్లో నటించిన నటి అవిక గోర్.. ఒంటరితనంపై సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ చేశారు. తన చుట్టూ ఎంతో మంది ఉన్నప్పటికీ తాను ఎదుర్కొంటున్న మానసిక ఒంటరితనం గురించి ఆమె పంచుకున్న మాటలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. “ఒంటరితనం అంటే ఎప్పుడూ ఒంటరిగా ఉండటం మాత్రమే కాదు. వంద మంది తెలిసినా, మనకు చోటెక్కడుందో తెలియకపోవడం కూడా ఒంటరితనమే” అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. “ఇప్పటికే ఏర్పడిన స్నేహితుల బృందాల్లో చేరేందుకు ప్రయత్నించడం చాలా అలసటగా ఉంటుంది. కెరీర్‌కే నా జీవితాన్ని అంకితమిచ్చాను. కాలం గడిచేకొద్దీ బంధాలను నిలబెట్టుకోవడం ఎంత కష్టమో ఆలస్యంగా గ్రహించాను” అని ఆమె వివరించారు. “ఇప్పుడు మనం స్నేహం కోసం సిద్ధంగా ఉన్నా, అప్పటికే అందరూ వారి సొంత గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అందరూ తెలిసినా, ఎక్కడికీ చెందని వారిలా మిగిలిపోతాం. నన్ను చేర్చుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరు” అని అవిక తన ఆవేదనను వ్యక్తం చేశారు. కెరీర్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల వ్యక్తిగత సంబంధాలు ఎలా ప్రభావితమవుతాయో అవిక మాటలు స్పష్టం చేస్తున్నాయి. చాలా మంది అనుభవించే ఇలాంటి భావాలను ఆమె ధైర్యంగా పంచుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఆమె చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455